ఏ ఉషోదయాన్నో అపరిచితుని క్రీగంటి చూపుల వలపుబాణం ఎదలో గుచ్చుకుని సిగ్గుదొంతరల చెక్కిళ్లు మందారాలు పూయగా బిడియపు సరిహద్దు

# తుషార

-డా. ఎస్. పద్మజ

రేఖల్ని సంధించినవేళ.

తొలిసారి తన గుండె తలుపు కన్నెప్పపాటులో కనుమరుగైపోయిన ప్రియుని తలచి సజల నయనాలతో సజీవ శిల్పమైపోయిన ఆ ప్రియురాలిని... ఏ సుదూర తీరాల్నుండో ప్రియుడు పంపిన సందేశంలా స్పర్శించి ఆమెలో సంతోషరేఖలు విరియగానే హోరున ఈలలు వేసుకుంటూ వెళ్లిపోవడం... చిరుగాలి భాష.

ఇరుకుద్వారాల పాయల్లో గలగలా ప్రవహిస్తూ సాగిపోవడం సెలయేటి భాష. పరిమళాల్ని వెదజల్లుతూ పుష్పించడం పువ్వుల భాష.

ఇలా సమస్త ప్రాణకోటికీ భాష్యం చెప్పలేని ఓ భాష వున్నట్టే...

మౌనం ఆమె భాష. ఆర్ద్రతతో మార్దవంగా పలికే స్వరమున్నా పెదవి దాటని మనసు ఆమెది. మాట మౌనమైనా ఆమె మనసు మాత్రం మౌనానికర్థమే తెలియదన్నట్లు అనుక్షణం సంభాషిస్తూనే వుంటుంది. ఆ మనసుకు మాట్లాడడానికి మరో మనసే అక్కర్లేదు.

ఉదయభానుడి కిరణాలతోనూ...

ఆ కిరణాల నులివెచ్చదనంలో పరిమళాల్ని వెదజల్లుతూ వికసించే పువ్వుల లావణ్యంతోనూ...

ఆ పువ్వుల మకరందాన్ని గ్రోలే గడుసు తుమ్మెదలతోనూ...

మిట్ట మధ్యాహ్నపువేళ సూర్యుడి తీక్షణ కిరణాలతోనూ...

సాయం సంధ్యవేళ చెలికాని తోడులేక గుండెల్లో గూడు కట్టుకున్న విచారంతో ఒంటరియై ఎగిరిపోయే విహంగంతోనూ...

పున్నమినాటి చంద్రకిరణాలతోనూ...

చివరకు చిన్ని గడ్డిపరకతోనూ ఆ మనసుకు సుపరిచితమే.

కేవలం వెన్నెల సోయగాల్ని మాత్రమే ఆమె ఆస్వాదించగలదనుకంటే అది పొరపాటే.

అమావాస్య రోజున ఏ రాతిగుండె మూలంగానో గాయపడి విషాదమే నిశీధిగా కప్పుకున్న విశాలాకాశాన్ని సైతం అతి నేర్పుగా మడిచి తన గుండెల్లో దాచుకుని వూరడించాలనే ప్రయత్నం ఆమెది.

వర్షరుతువులోని నీలిమేఘాలు కన్నీటి చారికల వెనుక దాగిన దుఃఖానికి కారణభూతులెవరోనని యోచిస్తూ ఆ పరధ్యానంలో ఉరుముల తాలూకు చిరుశబ్దాలకు సైతం భయకంపితమయ్యే చిన్ని హృదయం ఆమెది.

ప్రపంచాన్ని జయించాలనే అత్యాశ లేకపోయినా విశ్వంలో అణువణువునా దాగిన ఆత్మీయతాను రాగాలన్నీ తన హృదిలో నిక్షిప్తమవ్వాలనే స్వార్థం ఆమెది.

మౌనం ఆమె మాట.

సహనం ఆమె బాట!



## కథ వెనుక కథ

ఎగిరెళ్లకే ఓ కోయిలా ఈ తోట విడిచి... ప్రియుని తలపుల మాధుర్యంలో తేలిపోతూ వచ్చికపై కూర్చుని కవిత వ్రాసుకుంటూ వుంటుందా ప్రియురాలు బృందావనంలో కృష్ణుడి కోసం ఎదురుచూసే రాధలా! ఇంతలో ఆమె ప్రేమికుడొచ్చి తన పెళ్లి శుభలేఖ ఆమెకిచ్చేసి వెళ్లిపోతాడు. భరించలేని వ్యథ ఆమె గుండెల్లో ఇమిడిపోగానే ఆమె కనుల కొలనులు నీటి బిందువులతో నిండుకుంటాయి. 'నువ్వు లేవను ఊహకే కనుల నీరు నిండెను ఈ గుండె కరిగి' అంటూ తన కవితను పూరించుకుంటుందామె.

'దాంపత్యం' సినిమాలో సుహాసిని ఎఎన్ఆర్‌ల మధ్య సన్నివేశమిది. ప్రియుని కోయిలతో పోల్చుకుంటూ సుహాసిని ప్రదర్శించిన అద్భుతమైన హావభావాలే నా మనసును తాకి ఈ కథకు మూలమయ్యాయి. స్త్రీ విలువలు నానాటికీ దిగజారిపోతున్న ఈనాటి సినీరంగంలో సుహాసిని ఓ ఆణిముత్యమనుకుంటూ వుంటాను. నా రచనలకు తొలి స్పందన సుహాసినే.

-డా. ఎస్. పద్మజ
డాటరాఫ్ నారాయణ
ఇంటి నెం.30/49-ఇ-2
పాలిటెక్నిక్ కాలేజీ రోడ్
నంద్యాల.




**ఆశయం ఆమె గమ్యం!**

ఆశయాల శిఖరాల్ని చేరాలన్న గమ్యం వైపు దీక్షగా సాగాయి ఆమె అడుగులు.

చిన్నిపాటి శ్రమను కూడా తట్టుకోలేక మార్గమధ్యంలోనే అలసిన ఆమె మనసు పచ్చిక బయళ్లపై పవళించిందో క్షణం సేదదీర్చుకుంటూ ఆ క్షణంలోనే జరిగిందో ఊహించని అపురూప ఆగమనం. విచ్చేస్తున్న ఆ వసంతమాసాన ఆనందమే తన జీవిత భాష్యంగా కుహూ కుహూ రాగాలాపనతో పలకరించిందో కొమ్మపైని కోయిల.

పలకరింపుకే పులకించిపోయిందామె మనసు. తేనెలొలికే మాధుర్యం నీ గాత్రమన్నది. నీవే ఇక నా నేస్తమన్నది. ఆ నేస్తం చుట్టూ మృదుమధురంగానే మమతల బాంధవ్యాల్ని అల్లుకున్నది.

తాను కొవ్వొత్తై కరిగిపోతూ నేస్తానికి వెలుగునివ్వాలని ఆత్రుత పడ్డది. నీరెండలో కురిసిన జల్లుల్లో తడిసి ముడుచుకుపోయే ఆ కోయిల్ని చూసి తన ఆత్మీయతా కవచాన్ని కప్పింది.

క్షణమైనా కోయిల తలపుల్ని వీడక ఇక నా చివరి తోడు నీవేనంటూ నీలాకాశాన్ని వంచి ఇంద్రధనుస్సును తుంచి మెడలో అలంకరించి తన బాంధవ్యానికి శాశ్వత రూపాన్నీయదలచింది.

క్షణమైనా కోయిల తలపుల్ని వీడలేని ఆ చిన్ని హృదయం ఇక నీవే నా చివరి తోడంటూ నేస్తంలో ఐక్యమయ్యే సమయానికి భయంకరమైన ఓ చేదు వాస్తవాల్ని మిగిల్చి కనీసం చివరి వీడ్కోలుకైనా నోచుకోనివ్వక వెళ్లిపోయిందా కోయిల.

నమ్మలేని ఓ చేదునిజం ఆమె గుండెను గాయం చేసింది. అంతులేని ఆవేదనతో తల్లడిల్లిపోయిందామె హృదయం.

ఏ వసంతమాసంలోనో... రాగాలాపన చేసుకుంటూ ఏ సుదూర తీరాలనుండో ఎగిరొచ్చి ఆశ్చర్యంలో ముంచెత్తుతూ తన నేస్తం తన గుండెల్లో వాలిపోతుందని క్షణమొక యుగంలా నిరీక్షిస్తూ మూగగా రోదించిందామె హృదయం.

నేటి నిరాశలో రేపటిపైని ఆశను చంపుకోక క్షణాల్ని లెక్కించుకుంటూ నీలాకాశాన్ని దాటే ఉన్నత శిఖరాల్లో సంచరించే తన నేస్తానికీ, నేలపైన నీటి మడుగులో కలువ మొగ్గల్లే ముడుచుకుని ఉన్న తనకూ వ్యత్యాసముందని తెలిసినా...

మలిన రక్తమల్లే ఆ హృదిలోనికి ప్రవేశించి శుద్ధి చెంది పునీతమవ్వాలని పరితపిస్తూ...

ఏ ఘడియా తనకు శుభాన్ని చేకూర్చకపోగా రాబోవుకాలం తన నేస్తాన్ని తన దరి చేర్చగలదన్న మీమాంసలో కొట్టు మిట్టాడుతూ...

ఎదురుచూపుల్లో అలసిన కనులను ఘడియైనా మూయక అంతులేని నిరీక్షణలోని వేదనలోనూ మాధుర్యాన్ని ఆస్వాదించాలని ప్రయత్నిస్తూ...

దృష్టి అంతమయ్యే చోటున నింగి నేల ఏకమవుతున్న భ్రమ కల్గించినట్టు...

క్షణమొక యుగమైపోగా...

అనుక్షణమూ సంభాషించే ఆమె మనసు మూగవోయింది.

నేడు-

వేదనే... ఆమె మాట!

ఒకనాడు అలసిన తన నేస్తం ముద్దుమోమును ఆర్తిగా ఇముడ్చుకున్న తన వొడిని చూసి తారల చెంత జాబిల్లిని తలచి అసూయాగ్నిలో రగిలిపోతూ ఎర్రబడ్డ నీలాకాశాన్ని గుర్తు తెచ్చుకుని వర్తమానంలో ఆనాటి సంఘటన పునరావృతం కాకపోగా భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తోచి... ఆశా నిరాశల అలలపై తేలియాడుతూ తన నేస్తం జ్ఞాపకాలే తన నేస్తాలుగా మలుచుకుని గాలిలో దీపమల్లే రెపరెపలాడుతున్న ఆమె జీవితపటం చిరిగిపోయింది.

అలసిన జీవన గమంలో అడుగులు వేయలేని తన నిస్సహాయతకు తుది వీడ్కోలు పలికిందామె.

అశాశ్వతంలో శాశ్వతాన్ని నింపుకున్న ఆమె...తుషార!